


# సంధ్యా వెలుగులు

— సి. ఉమాదేవి

దేశ సరిహద్దులో పోరాటం ముగిసింది. సైనికుల సమయ స్ఫూర్తి, త్యాగనిరతి, ధైర్యసాహసాలు శత్రుసేన దాడిని వ్యూహాత్మకంగా తిప్పికొట్టాయి. పోరుకు తెరపడింది. కాని వర్ధనమ్మ గుండెల్లో పెను యుద్ధమే ప్రబలింది. నిశ్శబ్ద వనంలో పోతపోసిన నిశీధిలా కూర్చున్న సంధ్యను చూస్తే ఆ నిశ్శబ్దానికి వెనుక నిస్పృహ, నైరాశ్యము - వాటిని మనసులోనే అదుముకుని గంభీరంగా మారిన కూతురి ముఖం వర్ధనమ్మను వెంటాడుతోంది. కూతురి ఈ పరిస్థితికి అశక్తత తప్ప మరో భావం వ్యక్తం చేయలేని భర్తను కూడా విసుక్కుంటోంది.

"అసలు నాకిష్టం లేదు. వద్దే వర్ధని మొత్తుకున్నాను. అయినా నరే చేసారీ సంబంధం. పిల్ల వంటరిదైపోయింది. నామాట వినిపించుకున్నారు కాదు" వర్ధనమ్మ భర్త లోకనాథాన్ని విమర్శించడం ఇది ఎన్నోసారో లెక్కతేల్చలేం.

"కీడెంచి మేలెంచమన్నారు. వినిపించుకున్నాకాదు" వర్ధనమ్మ ముక్కు చీది కళ్ళు తుడుచుకుంది.

"అమ్మా! ఇక ఆపుతావా?" గట్టిగా అరిచింది సంధ్య.

మూగబోయిన కూతురి గొంతు పెగిలేదెప్పుడా అని కాచుక్కూర్చున్న వర్ధనమ్మ కూతురి గొంతు దాటిన అరుపుల లోనే మాటలను అప్యాయంగా ఏరుకుంటోంది.

సంధ్య తల్లినయితే ఊరుకోమంది కాని జ్ఞాపకాల నీడ వలలా పరచుకుని ఉక్కిరిబిక్కిరి చేస్తోంటే, కన్నీటి చారికల జాడలే గాని కన్నీటినిక విరజల్లలేమని గాజుగోళాల్లా మారిన కన్నులు మొండికేసి కూర్చుంటే భర్త ఫొటోవంక చూస్తూ మళ్ళీ మౌనరాగమే ఆలపించసాగింది.

ఆరోజు తనకు బాగా గుర్తు. తను మరువగలదా? ఎలా మరువగలదు? తెల్లవారితే పెళ్ళి. తమపెళ్ళి. రాత్రంతా జాగరణ చేయించినట్టయింది. భర్త స్నేహితులు, తన స్నేహితురాండ్రు ఆరోజు ఎలా ఆటపట్టించారు. వేళాకోళాల నడుమ హనీమూన్‌కు సింగపూర్ ఫ్లైట్ టికెట్లు తెచ్చిచ్చిన తండ్రిని "చూడు నాన్నా, అందరూ ఒకటే ఏడిపిస్తున్నారు" అని

> **పెళ్ళయితే అయింది. యుద్ధం లోకి వెళ్ళినవాడు వెనక్కి చూడకుండా వెళ్ళిపోయాడు. దేశంకోసంప్రాణాలర్పించాడు. దేశ భక్తుడు, యోధుడు అని అందరూ పొగుడుతుంటే మౌనంగా ఉండిపోయిన వర్ధనమ్మ కూతురిని చూస్తూ మాత్రం మౌనంగా ఉండలేక పోతోంది.**


గోములు పోయింది. "ఈరోజు మాత్రమే నమ్మా ఈ ఏడిపించడం, తరువాత అన్నీ నవ్వులే...ఆ ఆ ఏమిటి మీ అమ్మను అంతగట్టిగా పట్టుకుని ఊపేస్తున్నావు" అన్న తండ్రి మాటలకు ఫో నాన్నా నువ్వు కూడా అని బుంగమూతి పెట్టి సిగ్గుపడిపోయింది తను. సంధ్య ఆలోచనలను అతుకుతోంది. సింగపూర్ ట్రిప్ వారం రోజులు నిమిషాలమీద గడిచి పోయాయి. భర్తకు చేరువగా కూర్చుని ఇండియా తిరిగి వస్తున్నది సంధ్య. విమానం మబ్బులపైన తిరుగుతున్నట్టు పయనిస్తోంది. సంధ్య మనసు మబ్బుల్లో గిరికీలు కొడుతూ స్పష్టాస్పష్టల నడుమ తేలియాడుతోంది.

* * *

సింగపూర్ నుండి రాగానే మామగారు ఏర్పాటుచేసిన గ్రాండ్‌పార్టీ గుర్తుకు వచ్చింది సంధ్యకు. తమజంటను మేడ్‌ఫర్ ఈచ్ అదర్ అని అందరూ మెచ్చుకుంటుంటే పెళ్ళయిన జంటలు, పెళ్ళికాని వంటరివాళ్ళు అనూయ, మెచ్చుకోలు కలగలిపి చూసారు. ఎవరూ చూడకుండా తన నడుంమీద చిన్నగా గిల్లి, కన్నుగీటి నవ్వాడు ప్రశాంత్. బుగ్గల్లో అరుణిమ వెచ్చగా పాకి సిగ్గుగా తలవంచుకుంది తను. జీవంలేని గాజు కళ్ళనుండి కన్నీరును ఒత్తిపిండుకున్నట్టు రెండు చుక్కలు టపటపా రాలిపడ్డాయి.

వర్ధనమ్మ ఆపేసిన దండకం మళ్ళీ మొదలుపెట్టింది.

"దేవుడు చేసిందానికి నన్ను దోషిని చేసి మాట్లాడతావేం? విధి ఆడిన నాటకంలో నా కూతురి జీవితం ఇలా మలుపు తిరిగింది. దానికి ధైర్యం చెప్పాల్సిందిపోయి నువ్విలా జరిగిన వాటిని జరగకుండా ఉంటే బాగుండునని శుష్క ఆలోచన చేస్తే


Ramarao

ఏంలాభం?" విసుక్కున్నాడు లోకనాథం.

సంధ్యకు తల్లిదండ్రుల మాటలు నచ్చడంలేదు. లేచివెళ్ళి చిన్నగా తలుపులు బిడాయించుకుంది. తలుపులు మూసుకుంది. కాని తలపులు ఆపగలదా? సంధ్యను వీడక వెన్నాడుతూనే ఉన్నాయి. డబ్బు డ్రా చెయ్యాలని బ్యాంక్ కెళ్ళారు తామిద్దరు. టోనెన్ నెంబరు అరవైమూడు. టోకెన్ తనకు చూపి మనమెప్పుడూ ఇలాగే ఉండాలి ఎవరూ చూడకుండా చెవిదగ్గర గుసగుసలు. అదెలా? అర్థంకాక అడిగింది. ఎడమొహం, పెడమొహంపెట్టి ముప్పయి ఆరులా ఉండకూడదు - సంధ్యకు వెక్కిళ్ళు ఆగడం లేదు. వెక్కిళ్ళ నడుమ ఉలికి పడుతున్న శ్వాస. వర్ధనమ్మ మాట్లామాట్లాడి అలనిపోయింది. భర్తను, దేవుడిని నిందించుకుని కూతురి ఖర్మకు తన బాధ్యత లేదనుకుంటూ ఊరడిల్లుతోంది.

కూతురు తింటోందా లేదా పెట్టిన తిండి పారేస్తోందా? మరి ఎందుకలా సోలిపోతోంది? కూతురి గది తలుపు ముందు నిలుచుని చిన్నగా తలుపు తోసింది. పాలిపోయి మంచంపై పడివుంది సంధ్య. కూతురినా స్థితిలో చూసిన వర్ధనమ్మకు కడుపులో ప్రేగు మెలిపెట్టినట్లు బాధ కలిగింది.

మళ్ళీ మాటలు మొదలయ్యాయి నిశ్శబ్దాన్ని ఛేదించుకుని.

"పెళ్ళయితే అయింది. యుద్ధం లోకి వెళ్ళినవాడు వెనక్కి చూడకుండా వెళ్ళిపోయాడు, దేశం కోసం ప్రాణాల ర్పించాడు. దేశభక్తుడు, యోధుడు" అని అందరూ పొగుడుతుంటే మౌనంగా ఉండిపోయిన వర్ధనమ్మ కూతురిని చూస్తూ మాత్రం మౌనంగా ఉండలేకపోతోంది.

"అన్నం తినవు, గుండె బరువెక్కిం దంటావు. నీపైనే బురువు పడింది. పైగా ఈ బాధొకటి నీకు. ఈ బెడద రాకపోయినా భాగుండేది తల్లీ!" నిష్ఠూరంగా అంది వర్ధనమ్మ. జీవితాంతం మగతోడు లేక కూతురి ఒంటరి బ్రతుకు ఎలా బ్రతుకు తుంది? ఆమె ఆలోచనా పరిధి అంతకంటే దాటడంలేదు.

"అమ్మా" నీరసంగా పలికింది సంధ్య గొంతు.

"సరేలే నన్ను అడ్డుకుంటావు. నాకు గాకపోతే ఎవరికి బాధ?" కళ్ళొత్తుకుంది వర్ధనమ్మ బయటకు వెళ్ళిపోతూ.

"ఈ జంజాటం లేకపోతే మళ్ళీ పెళ్ళి చేసేవాళ్ళం"

"హుష్. ఇప్పుడేమిటి ఈ మాటలు? అమ్మాయి వింటే బాధపడుతుంది" నోటిమీద వేలు అన్చుకుని భార్యను ఊరుకోమన్నట్టుగా వారించాడు.

సంధ్య తల్లిమాటలు వారించక తప్పదనుకుని లేచింది.

"నాన్నా" సంధ్య గొంతులో నీరసం స్థానంలో దృఢత్వం తొంగిచూస్తోంది.

"మీకు మీ బిడ్డ భవిష్యత్తు ఎంత ముఖ్యమో, నాకు పుట్టబోయే బిడ్డ భవిష్యత్తు నాకంతే ముఖ్యం. నాబిడ్డను సంతోషంగా దీవించండి. నాకిప్పుడు కావలసినది అమ్మచెప్పే మగతోడు కాదు. అందుకు మరో పెళ్ళివద్దు. నాకు కావలసింది మానసిక స్థైర్యం. గుండె నిబ్బరంతో నిలదొక్కుకునే ధైర్యం. నాభర్త వెంట బ్రతుకంతా నడవాలనుకున్నాను. బ్రతుకంతా అటుంచి మరణంలో కూడా ఆయన వెన్నంటి నడవలేకపోయాను. కనీసం వారి అడుగు జాడలలోనైనా నన్ను, నాబిడ్డను నడవ నివ్వండి. నాభర్త శరీరం యంత్రమయి దేశానికి ఉపయోగపడింది. నేను నాభర్తలా ఎలా ఉపయోగపడాలని ఆలోచిస్తున్నానే గాని మగతోడు లేక ఎలా బతకాలా అని కాదు. నా మౌనంలో నా మనసు రోదిస్తున్నది మరో పెళ్ళి చేసుకోలేకపోయానే అని కాదు. వారి ఆశయాల నెలా అమలు పరచాలా అని. నా ఆశాకిరణం నాబిడ్డ. అమ్మా ఏడవకు నన్ను, నాబిడ్డను వెనకడుగు వేయకుండా పయనించమని ఆశీర్వదించు" తల్లి చేతులను తలపై ఉంచుకుని ఆర్తిగా అడిగింది సంధ్య. వర్ధనమ్మ కూతురి తల నిమురుతూ ఉండిపోయింది. సంధ్యచీకట్లు వీడి వెలుగులు నింపుకుంటోంది. M


AVM PRODUCTIONS



Anushaa Productions Presents

తెలుగు మెగా డైలీ సీరియల్

అఖిల

AKHILA



D. Achutha Reddy

Sponsored By:

LALITHA JEWELLARY
MEDIMIX
DERMI COOL SANDAL
FRESHIA
MOOV
D-COLD
EVER YOUTH
KOZYLON

జెమిని టీవిలో

సోమవారం నుండి శుక్రవారం వరకు మధ్యాహ్నం 1-30 గం॥

For Advertising:
D.Y. Chowdary

MANA Advertising Agency
Ad Film Makers Hyderabad. Tel: 7605230, Tel-Fax: 7676283